




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 1-8-2025

సంపుటి: 21 సంచిక: 111

పేజీలు: 8 వెల: రూ.1




కిల్లిపాలెం ర్యాంపు నుంచి అక్రమంగా తరలిపోతున్న ఇసుక



వసప వద్ద రైతులు ఆందోళన





బైరి వద్ద ల్యాండ్‌స్లైడ్‌ను తవ్వేస్తున్న దృశ్యం

## ఆగని అక్రమాలు

# అడిగితే దాడులు!

- ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు.. తరలింపు
- రెచ్చిపోతున్న అధికార పార్టీ నేతలు
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికారులు
- మొక్కుబడి సందర్శనలు, తనిఖీలతో సరి
- నీటి పథకాలు, నదీ కరకట్టలకు ప్రమాదం

“జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిపై గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నాగావళి, వంశధార తీరాల్లో అవకాశం ఉన్న ప్రతి చోటా యంత్రాలతో దర్జాగా ఇసుక తవ్వేసి వాహనాల్లో తరలించేస్తున్నారు. ప్రశ్నించేవారిని బెదిరిస్తూ, దాడులు చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారు. నదుల్లో ఇసుక లభ్యత లేకపోయినా ల్యాండ్ స్లైడ్స్ తవ్వేస్తున్నారు. నదుల్లో వరద ప్రవాహం ఉన్నా వెరవకుండా ఇసుకను తోడుకుపోతున్నారు.”



పాతూరు గ్రామస్తులకు వైకాపా నాయకులు పరామర్శ


(సత్యంన్యూస్, శ్రీకాకుళం/కొత్తూరు)

జిల్లాలో ఆమదాలవలస పరిధిలోని పాతూరు (పాత నిమ్మతొర్లాడ) ఇసుక ర్యాంపు వద్ద జరుగుతున్న అక్రమాల గురించి ప్రశ్నించినందుకు ఇటీవల అక్రమార్కులు దాడులకు పాల్పడ్డారు. నాగావళి గర్భంలో ఉన్న భూమి(పర)ని గ్రామ అవసరాలకు తాము వినియోగించుకుంటుంటే అక్రమార్కులు మాత్రం పరలో ఉన్న ఇసుకను అనుమతులు లేకుండా తవ్వుతుండటాన్ని పాతూరు గ్రామస్తులు ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన రౌడీమూకలు రాత్రి వేళలో గ్రామంలోకి వచ్చి ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడ్డారు. దీనిపై వైకాపా నాయకులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని ఆర్డీవో సాయిప్రత్యూష, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు సందర్శించి పరిశీలించారు. తక్షణమే ఇసుక తవ్వకాలు నిలిపేయాలని - మిగతా చివరి పేజీలో

## తులసిపేటలో పింఛన్ల పంపిణీ

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

మండలంలోని తులసి పేట గ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వితంతువులు, పలు సామాజిక వర్గాల పింఛన్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంపిణీ చేశారు. పథకం ప్రయోజనాలు గ్రామస్థులకు చేరుతున్నందుకు మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆర్డిఓ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్ర కుమార్, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విజేతలుగా నిలవడానికి నావంతు కృషి చేస్తా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలవడానికి తనవంతు కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం నగరంలో కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లా స్థాయి పి ఈ టీ.. పి డి ల సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా నిలిచే విధంగా శ్రీకాకుళం జిల్లా కోడి రామ్మూర్తినాయుడు స్టేడియంను తయారు చేస్తామని చెప్పారు. రానున్న ఆరు నెలల్లో స్టేడియం పనులు పూర్తి చేసి జిల్లా ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు.. క్రీడా రంగానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు పి. సుందర రావు, ఎం వి రమణ.. శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి, టీడీపీ యువనేత రెడ్డి గిరిజాశంకర్, టీడీపీ నగర అధ్యక్షుడు మాదరపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్ విధానంలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమ పెన్షన్ విధానం అమలు చేస్తున్నదని ఎస్.ఎం.ఈ, ఎన్నారై, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస గ్రామంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబం సుఖంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నెల నెలా పింఛన్లు అందిస్తూ ఎన్డీఏ ప్రభుత్వం గొప్ప సేవలందిస్తోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారమే ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో నెలకు సుమారు రూ.2,700కోట్లు, సంవత్సరానికి రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. దివ్యాంగుల ఆత్మగౌరవం కోసం రూ.6వేల పెన్షన్ ఇస్తున్నామన్నారు. ప్రజల బాధలు తెలుసుకునేందుకు ప్రతినెలా మొదటి తేదీన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనాలన్నది సీఎం చంద్రబాబు సూచనగా తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేం దుకు స్వచ్ఛ్ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని పరిశ్రమలలో ముందు వరుసలోకి తీసుకెళ్లాల న్నదే ముఖ్యమంత్రికి లక్ష్యమన్నారు.

### సూపర్ సిక్స్ హామీలన్నీ నేరవేర్చాం:


రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలన్నింటిని నేరవేర్చినట్టు మంత్రి స్పష్టం చేశారు. శనివారం నుంచి 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నట్టు వెల్లడించారు. అలాగే ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచితబస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానున్నదన్నారు. ఇప్పటికే పెన్షన్లు పెంచడం, ఏడాదికి మూడు ఉచితగ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలయ్యాయని చెప్పారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గ్రామస్తుల అభ్యర్థన మేరకు చెరువులో గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఉపాధిహామీ పనులు తాత్కాలికంగా నిలిచినప్పటికీ, రూ.40లక్షల చొప్పున రెండు రోడ్లకు రూ.80 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

- ఐటీ రంగాన్ని ఆక్రమించేస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్
- వేలల్లో ఉద్యోగాలకు కోత పెడుతున్న కంపెనీలు
- వేతన పెంపు, కొత్త నియామకాలు కూడా రద్దు
- సాంకేతికంగా అప్‌డేట్ అయ్యేవారికే మనుగడ
- మిడ్ లెవల్, సీనియర్ ఉద్యోగులపై అధిక ప్రభావం



## ఐటీ పొమ్మంటోంది..

# భవిష్యత్తు భయపెడుతోంది!



- పూర్వం బ్యాంకు ఉద్యోగాలను వైట్ కాలర్ జాబ్స్‌గా పరిగణించేవారు. అంటే బట్టలు నలగకుండా హాయిగా కొద్ది గంటల పాటు ఫ్యాన్ కింద కూర్చొని చేసే ఉద్యోగమన్నమాట. కానీ బ్యాంకింగ్ రంగంలోనూ ప్రైవేటీకరణ ఆ వైట్ కాలర్ ఉద్యోగాలనూ షరతులు, టార్గెట్లతో నలిపేస్తోంది.
- బ్యాంకుల తర్వాత ఐటీ ఉద్యోగాలను వైట్ కాలర్ జాబ్స్‌గా భావించడం మొదలైంది. రోజులో పనిచేసేది కొద్ది గంటలే.. అది కూడా వారానికి ఐదు రోజుల పని విధానం. వేలు, లక్షల్లో వేతనాలు. ఏసీ రూముల్లో కంప్యూటర్ల ముందు పని చేస్తూ.. రకరకాల అలవెన్సులు, భోజనాది సకల వసతులు.. అబ్బో.. ఐటీ అంటే ఎగిరి గంతేసినంత పని.
- కానీ రోజులు మారాయి. కొత్త నీరొచ్చి పాతనీటిని తరిమేసినట్లు ఐటీలో ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) వంటి కొత్త ఉపరంగాలు పుట్టుకొచ్చి.. సంప్రదాయ ఐటీ ఉద్యోగులకు పొగపెడుతున్నాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగం మరోసారి సంక్షోభంలో పడిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలోనూ రెండు మూడుసార్లు ఐటీ రంగంలో స్లంప్(మాంద్యం) ఏర్పడి ఇబ్బందులు ఎదురైనా.. వాటికి మించిన సంక్షోభం అంచున ప్రస్తుతం ఐటీ ఉద్యోగులు నిలిచి ఉన్న పరిస్థితి కనిపిస్తోంది.

డి.వి.రమణ - సత్యం ప్రత్యేక ప్రతినిధి

ప్రైవేట్ కంటే ప్రభుత్వ ఉద్యోగులకే ఉద్యోగ భద్రత ఉంటుంది. అలాంటి ప్రభుత్వ ఉద్యోగం కంటే ఈ కాలం యువత ప్రైవేట్ రంగంలోని ఐటీ ఉద్యోగాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఐటీ సంస్థల్లో జాబ్ ఆఫర్ వస్తే చాలు.. దర్జాగా లైఫ్‌ను లీడ్ చేయాలని కలలు కంటుంటారు. కానీ అది వాస్తవం కాదని మరోసారి తెలిసివస్తోంది. ఈ రంగంలో కొత్త సాంకేతిక విప్లవం, ఖర్చులు పెరగడం, లాభాలు తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో అస్థిరత వంటి రకరకాల కారణాలతో దిగ్గజ ఐటీ కంపెనీలే లేఆఫ్‌లు ప్రకటిస్తూ ఉద్యోగుల్లో గుబులు రేపుతున్నాయి. భవిష్యత్తుపై బెంగ కలిగిస్తున్నాయి. 2019లో మొదలైన ఉద్యోగాల కోతలు ఐదేళ్లు దాటినా ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ ఏడాది కూడా పదులసంఖ్యలో కంపెనీలు వేలాది ఉద్యోగులను ఇంటికి పంపేశాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్ వంటి బహుళజాతి సంస్థలతో పాటు టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా లాంటి బడా దేశీయ కంపెనీలు కూడా వేలసంఖ్యలో ఉద్యోగులను - మిగతా లోపలి పేజీలో



• ఎడిటోరియల్

# ఇంధన ఒత్తిళ్లకు ఇథనాల్‌తో చెక్!

తన మాట వినకుండా రష్యాతో వాణిజ్య బంధం కొనసాగిస్తున్నామన్న కక్షతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రగిలిపోతున్నారు. భారత్ ఒక సార్వభౌమాధికార దేశమని మర్చిపోయి అవాకులు చవాకులు పేలుతున్నారు. ముఖ్యంగా రష్యాపై అమెరికా సహా పశ్చిమ దేశాలు, నాటో కూటమి విధించిన ఆంక్షలను బేఖాతరు చేస్తూ ఆ దేశం నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌కు ట్రంప్ దొర 25 శాతం ప్రతీకార సుంకాలు విధించారు. తక్కువ ధరకు వస్తున్నందున రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నామని.. తమ దేశ ఆర్థిక, వాణజ్య భద్రతకు ఇది అత్యావశ్యకమని భారత్ స్పష్టం చేస్తోంది. అయినా భారత వాదనను వినిపించుకోకుండా ట్రంప్ ద్వైపాక్షిక వాణిజ్య చర్చలను కూడా నిలిపివేసి ఏకపక్షంగా 25 శాతం వాణిజ్య సుంకాలను విధించేశారు. ప్రస్తుతానికి దీనిపై భారత ప్రభుత్వం కాస్త మౌనం, సంయమనం పాటిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఆ మౌనం వెనుక ఒక వ్యూహ రచన జరుగుతోంది. అదే ముడిచమురు దిగుమతులను సాధ్యమైనంతగా తగ్గించుకోవాలన్నదే ఆ వ్యూహంగా కనిపిస్తోంది. పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ మోతాదు పెంచడం ద్వారా చమురు దిగుమతుల భారాన్ని కొంతవరకు తగ్గించుకోవడానికి మన ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మన దేశంలో ముడి చమురు నిల్వలు పెద్దగా లేవు. అందుకే అవసరాల్లో 80 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. గతంలో రష్యా, ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, అమెరికా సహా 27 దేశాల నుంచి ముడి చమురు కొనుగోలు చేయగా.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గల్ఫ్‌లో ఉద్రిక్తలు, అమెరికా పెత్తందారీ ధోరణుల నేపథ్యంలో ఇప్పటికే చమురు కొనగోళ్లకు వేరే దేశాలతో కూడా ఒప్పందాలు చేసుకుంది. దాంతో భారత్‌కు చమురు సరఫరా చేసే దేశాల సంఖ్య 40కి పెరిగింది. దీనివల్ల చమురు దిగుమతులు ధోకా లేకపోయినా.. పూర్తిగా దిగుమతులపై ఆధారపడటం వల్ల ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో వీటి కోసమే 242.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనికి తోడు ఇప్పుడు ట్రంప్‌గారి సుంకాల మోత తోడవుతోంది. ఇలాంటి అనేక సవాళ్లు, ఒత్తిళ్లను అధిగమించగలిగే ప్రత్యామ్నాయాల గురించి మన ప్రభుత్వం ఆలోచిస్తోంది. చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గితేనే ఖర్చులు, ఒత్తిళ్లు తొలగిపోతాయి. దేశీయంగా ముడి చమురు వనరులు పెంచుకునే అవకాశాలు ఇప్పటికిప్పుడు అందుబాటులో లేవు. దానికి బదులుగా పెట్రోల్‌లో ఇథనాల్ కలిపి వినియోగించడం మరో ప్రత్యామ్నాయం. ఈ దిశగా ఇప్పటికే దేశంలో విక్రయిస్తున్న పెట్రోల్‌లో 20 శాతం వరకు ఇథనాల్ కలపాలన్న లక్ష్యానికి చేరుకున్న భారత ప్రభుత్వం ఇప్పుడు దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్లాన్ చేస్తోంది. పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ శాతాన్ని 27 శాతానికి పెంచాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త ఇంధనాన్ని ఈ-27 అనే పేరుతో పిలుస్తారు. ఇలా చేయడం ద్వారా ముడి చమురు దిగుమతుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని భావిస్తున్నారు. 27 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ ఉపయోగించడానికి వీలుగా వాహనాల ఇంజిన్లలో చేయాల్సిన మార్పులపై పరిశోధనలు ప్రారంభించాలని ఏఆర్ఏఐ సంస్థకు కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. ఈ పరిశోధనల ఫలితాలకు అనుగుణంగా వాహన తయారీదారులు తమ ఉత్పత్తుల్లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇది దేశీయ ఇంధన వినియోగంలో పెద్ద మార్పు తీసుకురావడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. మన ఇంధన అవసరాలను దేశీయంగా తీర్చుకోగలిగితే ఇతర దేశాలపై దాని ఆధారపడటం తగ్గుతుంది. ఇది భౌగోళిక రాజకీయాల్లో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అమెరికా వంటి దేశాల ఒత్తిళ్లను అధిగమించడానికి రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది. పెట్రోల్‌లో ఇథనాల్ మిక్సింగ్ శాతాన్ని పెంచడం వల్ల రెండు ప్రధాన ప్రయోజనాలు ఉన్నాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడిచమురు మొత్తాన్ని గణనీయంగా తగ్గించవడం మొదటి అతి పెద్ద ప్రయోజనం. దీనివల్ల మన దేశానికి విలువైన విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది. ఇక దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెరుగడం రెండో ప్రయోజనం. ఇది వ్యవసాయ రంగానికి బూస్ట్ ఇస్తుంది. రైతులకు అదనపు ఆదాయ వనరులను సృష్టిస్తుంది. ఇథనాల్ తక్కువ కాలుష్యం విడుదల చేస్తుంది. దాంతో పర్యావరణానికి మేలు జరుగుతుంది. మొత్తంగా ఇంధన రంగంలో భారత్ ఇబ్బందులను తగ్గిస్తుంది.

సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి

# ఆర్థిక సహాయం




(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేట మండలం, ఈతపేట గ్రామంలోగల అమరావతి కోచింగ్ సెంటర్‌లో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బి.కాగేశ్వర రావు నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉచితంగా శరీర దృఢత్వంకి సంబంధించిన తర్ఫీదునిస్తున్నారు. త్వరలోనే అగ్నివీర్, అగ్నిపత్ ప్రారంభమవుతాయని, నిరుపేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చే సమయంలో శరీర దృఢత్వానికి బలమైన ఆహారం అవసరం అవుతుందని, సహాయం చేయమని, స్వచ్ఛందసంస్థలకు, దాతలకు కోరారని స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న, సిక్కోలు స్వచ్ఛంధ సేవా సమితి దాతలు, మిత్రుల సహకారంతో రూ.8వేలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రేవాడ త్రినాధరావు మాస్టర్, సురపతి లక్ష్మణరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

(సత్యంన్యూస్, మందస)

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మొట్టమొదట ఎస్.ఈ.ఆర్.పి.(సెర్ప్) సంస్థ ద్వారా అమలుపరిచిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని అర్హులందరికీ ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసినట్లు వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం బాలిగాం పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షులు భావన దుర్యోధన ఆధ్వర్యంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు కే.శైలజ లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. ఈ మధ్యకాలంలో భర్త చనిపోయి నిరాదరణకు గురైన వితంతువులకు కొత్తగా మంజూరైన పెన్షన్లను కూడా ఈనెల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు మీనాక్షి, బాలకృష్ణ, వి.వో.ఏ. జానకి, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





కుశాలపురంలో శుక్రవారం కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఎన్ఈఆర్వితంతు పింఛన్ అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, బెందు మల్లేశ్వరరావు, అన్నెపు భువనేశ్వరరావు, చౌదరి నారాయణ మూర్తి, పైడి సాంబమూర్తి, పైడి అన్నంనాయుడు, బాడాన జనార్దన్, గాలి రెడ్డి, సనపల రామారావు, వావిలాపల్లి రామకృష్ణ, బచ్చు కోటిరెడ్డి, రాంబాబు, తమ్మినేని గోవింద రావు, మెండ రాజారావు, వెంకటరమణ, సాంబమూర్తి, మూకళ్ల భాస్కరరావు తదితరులున్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల

# కాకినాడ ఆదిత్యలో 'విస్మయ-2005'

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్‌లోగల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ డేటాసైన్స్ ఆధ్వర్యంలో "విస్మయ-2025" ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రఘురామ్, కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల రీజనల్ డైరెక్టర్ పి.రామకృష్ణరెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణు గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ రంగంలో డేటా సైన్స్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యంగా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్నిరంగాల్లో వినియోగిస్తున్నారన్నారు. విద్యార్థులు డేటాసైన్స్‌లో నైపుణ్యాన్ని పెంచుకొని ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. ముఖ్యంగా డేటా సైన్స్‌లో కోడింగ్, ప్రోగ్రామింగ్‌కు అత్యంత ప్రాధాన్యత ఉందని, కావున విద్యార్థులు కోడింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ బహుళజాతి సంస్థలు డేటాసైన్స్ నిపుణులను నియమించుకుంటున్నాయనీ, ఆయా రంగాల్లో అపారమైన అవకాశాలు వున్నాయన్నారు. బి.రఘురాం మాట్లాడుతూ డేటా సైన్స్‌లో అత్యధిక వేతనాలతో ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ఎంతోమంది డేటాసైన్స్‌లో నిపుణుల అవసరం ఉందని, కనుక ప్రతి ఒక్కరు కూడా డేటా అనలటిక్స్, బిగ్ డేటా వంటి అంశాలలో పట్టు సాధించాలని తెలిపారు. ఈ విస్మయ-2025 సందర్భంగా విద్యార్థులకు ప్రాజెక్ట్ పోస్టర్ ప్రజెంటేషన్, డిబగ్గింగ్, లోగో డిజైన్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథి చేతుల మీదుగా విద్యార్థులకు వివిధ పోటీలలో గెలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.




## పింఛన్లు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశంపార్టీదే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో నిరుపేదలు, ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు ఎదుర్కొంటున్న కష్టాలను తొలగించేందుకు తొలి సారిగా పింఛన్లు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. ఈమేరకు పోలాకి మండలం, మబగాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పింఛన్లు పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ అప్పుడు రూ.30తో ప్రారంభమైన పింఛన్లను నేడు రూ.4వేలకు పెంచిన ఘనత కూడా టీడీపీదేనన్నారు. నిరుపేదలకు భరోసా కల్పించేలా టీడీపీ గతంలో చట్టాలను, పథకాలను రూపొందించిందన్నారు. ఈనెల నుంచి నరసన్నపేట నియోజకవర్గంలో కొత్తగా 678 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, ఇందుకోసం నెలవారీగా రూ.27,12,000 రూపాయలు కేటాయించబడిందన్నారు. అదేవిధంగా, మొత్తం నియోజకవర్గం పరిధిలో 38,169 మందికి రూ.16 కోట్లు 1 లక్ష రూపాయలు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వివరించారు. కార్యక్రమంలో నియోజక వర్గ అబ్జర్వర్ కోయిలాడ వెంకటేష్, ఇంచార్జి ఎంపిడిఓ సూర్యప్రకాష్, కాయ రవి, ధర్మాన అమ్మన్నాయుడు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.






# ఓ మోస్తరు కిక్కు!

**కథ:** 1991 ప్రాంతంలో సూరి (విజయ్ దేవర కొండ) హైదరాబాద్ లో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తుంటాడు. చిన్నతనంలోనే తండ్రిని చంపి పారిపోయిన తన అన్న శివ (సత్యదేవ్) కోసం అతను ఎదురు చూస్తుంటాడు. అలాంటి సమయంలో శివ శ్రీలంకలోని జాఫ్నాలో ఒక స్మగ్లింగ్ గ్యాంగ్‌కి లీడర్‌గా ఉన్నట్లు సూరికి తెలుస్తుంది. ఒక పోలీస్ అధికారి శివ గురించి ఈ విషయం చెప్పి అతడిని తిరిగి తీసుకురావడం కోసం జాఫ్నాకు సూరిని గూఢచారిగా పంపిస్తాడు. మరి జాఫ్నాకు వెళ్లిన సూరి.. శివను కనుక్కున్నాడా? తన అన్నను తిరిగి తెచ్చుకున్నాడా? అక్కడ అతడికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? వాటిని అతనెలా ఛేదించాడు? ఈ ప్రశ్నలన్నిటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**కథనం-విశ్లేషణ:**

విజయ్ దేవరకొండ చివరగా ఎప్పుడు నిఖార్సయిన హిట్టు కొట్టాడో తన అభిమానులు కూడా మరిచిపోయిన పరిస్థితి. అయినా తన కొత్త చిత్రం 'కింగ్డమ్'పై ప్రేక్షకుల్లో అమితాసక్తి కనిపించిందంటే అందుకు ప్రధాన కారణం.. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. మళ్ళీ రావా.. జెర్సీ చిత్రాలతో తన స్థాయి వేరని చాటుకున్న ఈ యువ దర్శకుడు 'కింగ్డమ్' ప్రోమోలతో ప్రేక్షకులను ఆశల పల్లకిలో ఊరేగించాడు. గౌతమ్ అంటే భిన్నంగా ఏదో చేస్తాడని.. కొత్త అనుభూతి పంచుతాడనే భరోసాతో 'కింగ్డమ్'థియేటర్లలో అడుగు పెట్టారు. కానీ వారిని ఊరించి ఊరించి ఒకింత నిరాశకే గురి చేస్తాడు గౌతమ్. ఓవైపు తన మార్కు చూపిస్తూనే.. ఇంకోవైపు పాపులర్ 'ట్రెండు'ప్రభావంలో పడిపోయాడా అనిపిస్తుంది 'కింగ్డమ్'చూస్తున్నంతసేపు. ఈ ఊగిసలాటలో ఈ చిత్రం ప్రేక్షకులకు మిశ్రమానుభూతినే మిగులుస్తుంది. ఏదో గొప్పగా చూడబోతున్నామనే ఆశలు రేకెత్తించి.. చివరికి ఇంతేనా అనుకునేలా ఒకింత నిరాశకు గురి చేస్తోంది. 'కింగ్డమ్'బాలేదని అనలేం.. అదే సమయంలో బాగుందని ధీమాగానూ చెప్పలేని పరిస్థితి. నాగరిక సమాజానికి దూరంగా ఓ ప్రపంచం.. అందులో బానిస బతుకులు బతికే జనం.. దినదిన గండంగా గడుపుతున్న తమను కాపాడ్డానికి ఒకడొస్తాడని ఆ జనం ఎంతో కాలంగా ఎదురు చూస్తుంటే.. అక్కడికి అనామకుడిలా వచ్చి వారి రక్షకుడిగా మారే కథానాయకుడు.. ఇది ఎన్నో ఏళ్ల నుంచి నడుస్తున్న మాస్ హీరో కథల ఫార్ములా. నేపథ్యం విషయంలో బాగానే కసరత్తు చేసినప్పటికీ.. టేకింగ్ పరంగా తన ముద్రను చూపించినప్పటికీ.. కథను నడిపించడంలో గౌతమ్ తిన్ననూరి సైతం చివరికి ఈ సగటు ఫార్ములా లోనే పడిపోయాడు. 'యుగానికి ఒక్కడు'.. 'ఛత్రపతి'.. 'కేజీఎఫ్'లాంటి సినిమాలను మిక్సీలో కలిపి కొట్టినట్లుగా అనిపిస్తుంది ఈ సినిమా చూస్తుంటే. ఐతే ఈ కథలను ఎన్నిసార్లు తీసినా జనం చూస్తారు.. ఈలలు వేస్తారు.. ఉద్వేగంతో ఊగిపోతారు.. అది ఎప్పుడంటే బలమైన ఎమోషన్ కుదిరినపుడు. గౌతమ్ ఇలా ప్రేక్షకులను ఊపేయడానికి అన్నదమ్ముల ఎమోషన్‌ను మార్గంగా ఎంచుకున్నాడు. ప్రాణంగా ప్రేమించే అన్న అనుకోకుండా తనను వదిలి వెళ్లిపోతే.. తన కోసం ఎన్నో ఏళ్ల తర్వాత వెతుక్కుంటూ వెళ్లే తమ్ముడి ఎమోషన్ మీద ఒక దశ వరకు దర్శకుడు ఆసక్తికరంగానే కథను నడిపించాడు.

ఐతే ఈ అన్నదమ్ములిద్దరూ తిరిగి కలిసే వరకు బలంగా అనిపించే ఎమోషన్.. ఆ తర్వాత మాత్రం పలుచబడిపోయింది. హీరోను యోధుడిని చేయడానికి బలవంతంగా చేసిన ప్రయత్నం కృత్రిమంగా అనిపించడం వల్ల..పతాక ఘట్టాలను ఎంత భారీగా.. అదిరిపోయే ఎలివేషన్‌తో తీసినప్పటికీ రావాల్సిన హై రాలేదు. ఐతే ఓవరాల్‌గా అసంతృప్తిని మిగిల్చినా.. 'కింగ్డమ్' ఎక్కడా బోరింగ్‌గా మాత్రం అనిపించదు. సినిమాలో హైలైట్ అని చెప్పుకోదగ్గ ఎపిసోడ్లు ఉన్నాయి. ముఖ్యంగా ప్రథమార్ధం సినిమాకు పెద్ద ప్లస్. ఈ కథను.. హీరో పాత్రను మొదలుపెట్టిన తీరు ఎంతో ఆసక్తి రేకెత్తిస్తుంది. కనిపించకుండా పోయిన తన అన్న కోసం హీరో స్పైగా మారే వైనం.. శ్రీలంకకు వెళ్లి తన అన్నను కలవడానికి చేసే ప్రయత్నం.. ఈ ఎపిసోడ్లన్నీ పకడ్బందీగా తెరకెక్కించాడు దర్శకుడు గౌతమ్. జాఫ్నాలో స్మగ్లింగ్ గ్యాంగ్స్.. అక్కడుండే తెలుగు తెగ..ఆర్మీకి వీరికి మధ్య ఘర్షణ.. ఈ సెటప్ అంతా భారీగా.. క్యూరియాసిటీ పెంచేలా ఉంటుంది. హీరో అక్కడికి వెళ్లి తన అన్నతో కలిసి తన గ్యాంగులో ఒకడిగా మారడం.. తర్వాత నాయకుడిగా ఎదగడం.. ఈ క్రమంలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్లు ఇవన్నీ మంచి టెంపోతో సాగుతాయి. విరామ సమయానికి 'కింగ్డమ్'మంచి హై ఇస్తుంది. కానీ ద్వితీయార్ధం గురించి ఎంతో ఊహించుకుంటే.. అది మాత్రం నిరాశకు గురి చేస్తుంది. హీరో ఒక లక్ష్యంతో ఒక చోటికి వెళ్లినపుడు ఆ లక్ష్యమైనా నెరవేరాలి. లేదా అంతకుమించిన ఒక పెద్ద ప్రయోజనమైనా చేకూరాలి. ఐతే 'కింగ్డమ్'లో ఈ రెండూ జరక్కపోవడమే విడ్డూరంగా అనిపిస్తుంది. హీరో శ్రీలంకకు వెళ్లిన పని పూర్తి కాదు. పోనీ అంతకుమించిన పెద్ద కార్యం ఏదైనా పూర్తి చేస్తాడా అంటే అదీ లేదు. అక్కడి పరిస్థితులను ఇంకా కాంప్లికేట్ చేస్తాడు. జరగాల్సిన నష్టమంతా జరిగిపోయాక తమ కోసం ఒక రక్షకుడు వచ్చాడంటూ అతణ్ని అక్కడి జనం అతణ్ని కీర్తిస్తారు. దీంతో హీరో ఏ పర్పస్‌తో అక్కడికి వెళ్లాడు.. ఏం సాధించాడు అని చూస్తే చివరికి పెద్దగా ఏమీ కనిపించదు. ప్రిక్లైమాక్సులో ఊచకోత ఎపిసోడ్లో మిశ్రమానుభూతిని కలిగిస్తుంది. తమ వ్యాపారానికి మూలమైన వాళ్లనే విలన్ నామరూపాల్లేకుండా చేయాలనుకోవడంలో లాజిక్ ఏంటో అర్థం కాదు. క్లైమాక్సులో వచ్చే యాక్షన్ ఎపిసోడ్ బాగున్నా.. అది అనేక ప్రశ్నలను రేకెత్తిస్తుంది. ఈ ప్రశ్నలకు సమాధానం సెకండ్ పార్టులో చూసుకోమన్నట్లుగా లీడ్ ఇచ్చి సినిమాను ఒక అసంతృప్తితోనే ముగించారు. ఓవరాల్ గా చెప్పాలంటే 'కింగ్డమ్'లో గొప్పగా ఏదో చేయడానికి ఒక ప్రయత్నం జరిగినా.. అది సంతృప్తికరంగా మాత్రం ముగియలేదు. ఒకసారి చూడ్డానికి ధోకా లేని ఈ సినిమాపై ఎక్కువ అంచనాలను పెట్టుకోకపోవడం మంచిది. – తుపాకి.కామ్ సౌజన్యంతో

**నటీనటులు:** పెర్ఫామెన్స్ పరంగా విజయ్ దేవరకొండకు 'కింగ్డమ్'కెరీర్లో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ చిత్రాల్లో ఒకటవుతుంది. సూరి పాత్ర కోసం అతను ప్రాణం పెట్టేశాడు. ఆరంభం నుంచి చివరి వరకు ఒక ఇంటెన్సిటీతో సాగే పాత్రలో విజయ్ ఎంతో చక్కగా ఒదిగిపోయాడు. లుక్ పరంగానే కాక బాడీ లాంగ్వేజ్ లోనూ విజయ్ వైవిధ్యం చూపిం చాడు. అన్న కోసం తపించే తమ్ముడి పాత్రలో అతను భావోద్వేగా లను చక్కగా పలికించాడు. విజయ్ అన్నగా సత్యదేవ్ కూడా చాలా బాగా నటించాడు. అతనెంత మంచి పెర్ఫామర్ అన్నది మరోసారి ఈ సినిమాలో రుజువైంది. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే పాత్ర పరిధి మరీ తగ్గించేశారు. తన మీద సన్నివేశాలను, పాటను ఎడిటింగ్‌లో తీసేసినట్లున్నారు. అందుకే ఆ క్యారెక్టర్ ఇంపాక్ట్ పెద్దగా కనిపించదు. కనిపించిన తక్కువ సన్నివేశాల్లో భాగ్యశ్రీ బాగానే అనిపించినా.. తనకి ఈ కథలో పెద్దగా ప్రాధా న్యం కనిపించదు. విలన్ పాత్రలో వెంకిటేష్ ఆకట్టుకున్నాడు. కేవలం కళ్లతో విలనీని పండించాడు. కానీ తన పాత్ర నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తాం. మరో మలయాళ నటుడు బాబు రాజ్.. అయ్యప్ప పి.శర్మ.. రాజ్‌కుమార్ కసిరెడ్డి.. వీళ్లంతా సహాయ పాత్రల్లో ఆకట్టుకున్నారు. హీరోని స్పైగా మార్చే పాత్రలో చేసిన బాలీవుడ్ నటుడు కూడా ఓకే.

**సాంకేతిక వర్గం:** 'కింగ్డమ్'కు సాంకేతికంగా అతి పెద్ద ఆకర్షణ అనిరుధే. తన నేపథ్య సంగీతం సినిమాను డ్రైవ్ చేయడంలో కీలక పాత్ర పోషించింది. ప్రతి సన్నివేశాన్నీ దాని స్థాయికి మించి పైకి లేపడానికి అనిరుధ్ ప్రయత్నించాడు. తన పాటలు కూడా సినిమాలో బాగానే కుదిరాయి. కానీ 'కింగ్డమ్'లో చార్ట్ బస్టర్ అనిపించే సాంగ్ అయితే ఏదీ లేకపోవడం మైనస్సే. జోమోన్ జాన్-గిరీష్ గంగాధరన్ కలిసి అందించిన ఛాయాగ్రహణం సినిమాలో మరో ఆకర్షణ. విజువల్స్ టాప్ నాచ్ అనిపిస్తాయి. ప్రతి సన్నివేశాన్నీ అందంగా తీర్చిదిద్దారు. సినిమాను చాలా రిచ్‌గా తీశారు. పెద్ద హీరోల సినిమాల స్థాయిలో సితార సంస్థ ఖర్చు పెట్టింది. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ప్రయత్నాన్ని తక్కువ చేయలేం కానీ.. తన మీద పెట్టుకున్న అంచనాలను మాత్రం అందుకోలేకపోయాడు. కథ విషయంలో అతను చేసిన కసరత్తు తెరపై కనిపిస్తుంది. టేకింగ్‌పరంగా అతను తన ముద్రను చూపించాడు. ఒక దశ వరకు కథాకథనాలను బాగానే నడిపించాడు. కానీ తర్వాత మాత్రం 'కేజీఎఫ్'తరహా సినిమాల ప్రభావానికి లోనై గాడి తప్పాడనిపిస్తుంది. డ్రామాను అనుకున్నంతగా రక్తికట్టించలేకపోయాడు.

**కీర్తి, కాంత, కనకం ఈ మూడింటికి లొంగని వారు దాదాపుగా ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. ఒకవేళ ఎవరైనా ఉన్నారంటే వారు సర్వసంగ పరిత్యాగులో, ముక్కు మూసుకుని హిమాలయాల్లో తపస్సు చేసుకునే రుషులో అయి ఉంటారు. వీరెవరూ కాకుండా మనం జీవిస్తున్న ఈ సమాజంలోనే అలాంటివారు ఎవరైనా ఉన్నారంటే, జనతా గ్యారేజి సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ అన్నట్టు అటువంటి వారిని మనం చాలా భద్రంగా కాపాడుకోవాలి.**

**ప్రస్తుత సమాజంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు లాంటి ఘోరాలన్నీ కాంత కోసమో, కనకం కోసమో జరుగుతున్నవే (కనకం అంటే బంగారం అనే కాకుండా డబ్బు అని అన్వయించుకుందాం). అయితే ఈ రెండింటికంటే కీర్తి కాంక్ష ప్రమాదకరమైనది. ఈ కీర్తి కాంక్ష వ్యక్తులకు ఉంటే అది వ్యక్తిగతమైతే ఫర్వాలేదు. అదే ప్రజలను పాలించే పాలకులకు ఉంటే చాలా ప్రమాదకరం.**

# పాలకుల కీర్తి కాంక్ష
# పాలితులకు చేటు..!




### 30 ఏళ్ల ముఖ్యమంత్రి కల..

నేతల కీర్తి కాంక్ష ఒక దశ వరకు మంచిదే, ఆ కీర్తి కాంక్షతో వారు కొన్ని మంచి పనులు చేస్తారు. ప్రజలందరూ తమను మెచ్చుకోవాలనే ఉద్దేశంతో మంచి పథకాలను ప్రవేశపెడతారు. ఈ రకంగా ప్రజలకు మేలు జరుగుతుంది. అయితే కీర్తి కాంక్ష తారాస్థాయికి (ఒక రకంగా పిచ్చి అనుకోవచ్చు) చేరినప్పుడు, అది వెర్రితలలు వేస్తుంది. అప్పుడది బూమరాంగ్ అవుతుంది.

రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని తెగ తాపత్రయపడ్డారు. ప్రతి ఇంట్లో తన తండ్రి ఫొటో పక్కన తన ఫొటో కూడా పెట్టుకోవాలని తలచారు. ఆ ఉద్దేశంతో, గతంలో ప్రజల కోసం ఏ ముఖ్యమంత్రీ ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. ఆ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ప్రగాఢ నమ్మకంతో కూడా ఉన్నారు.

అయితే, ఆయన కీర్తికాంక్షతో పథకాలు అన్నింటికి తన పేరు తగిలించడమే కాకుండా, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి ఎన్టీఆర్ పేరు తీసేసి తన తండ్రి పేరు పెట్టడం, పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాలపైన తన ఫొటో ముద్రించడం లాంటివి ఆయనకు చేటు చేశాయి. ఇక ప్రజలకు ఏం చేటు జరిగిందంటే, ఆయన ఫోకస్ అంతా సంక్షేమంపై పెట్టడం. రాజధాని అమరావతిలో కొనసాగిస్తే అది చంద్రబాబుకు పేరు వస్తుంది కానీ తనకు రాదని, తనకు పేరు రావాలంటే మూడు రాజధానులు అంటూ, మూడు ప్రాంతాలు అభివృద్ధి చేయాలనుకోవడం. ఇలా రాజధాని అంశాన్ని రాజకీయం చేయడం రాష్ట్ర ప్రజలకు చేటుచేసింది. 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలన్న జగన్ కీర్తికాంక్ష నెరవేరలేదు. ఐదేళ్లకే ప్రజలు ఆయన్ను ఇంటికి సాగనంపారు.

### పతాక స్థాయికి చేరిన చంద్రబాబు కీర్తి కాంక్ష..

ఇక ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయానికి వస్తే, ఈయనకు కూడా కీర్తి కాంక్ష తారా స్థాయిలో ఉంది. అదే, పిచ్చి దశకు చేరింది. గతంలో సైబరాబాద్ నేనే నిర్మించాను. ఇప్పుడు అమరావతి నగరాన్ని ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా మహా నగరంగా నిర్మిస్తానంటూ ఆయన చేస్తున్న పనులు రాష్ట్రానికి చేటు చేస్తున్నాయి. ఇటలీలోని వెనిస్ నగరంలా నదీ తీరంలో రాజధాని నిర్మించాలనే ఆయన కాంక్ష మూడు పంటలు పండే భూములను స్వాధీనం చేసుకుంది. రైతులకు లేనిపోని భ్రమలు, ఆశలను కల్పించింది. ఇప్పుడు 15వేల ఎకరాల్లో విమానాశ్రయం ఇంకా ఏదేదో కడతానంటూ మరో 40వేల ఎకరాలు కావాలంటున్నారు. మొత్తం మీద లక్ష ఎకరాల్లో రాజధాని అంటున్నారు. ఎందుకో కానీ చంద్రబాబుకు లక్ష అనే సంఖ్య మీద మహా మోజు ఉన్నట్టుంది. ఎవరెన్ని అనుకున్నా ఆయన లక్ష ఎకరాలు తీసుకుని తీరతారు.

### మబ్బులను నీళ్లు పారబోసుకున్న రైతులు..

మబ్బులను చూసి రైతులు కుండలోని నీళ్లు పారబోసుకున్నారు. 11 ఏళ్లయినా ఆ మబ్బులు కాసుల వాన కురిపించలేదు. ఇప్పుడిప్పుడే కొందరి రైతుల కళ్లు తెరుచుకుంటున్నాయి. అయితే చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యారు కదా, ఈ ఐదేళ్లలో రాజధానిని ఒక స్వరూపానికి తెచ్చేస్తారు. తమ ఫ్లాట్ల రేట్లు పెరుగుతాయని ఇంకా చాలామంది రైతులు ఆశతోనే ఉన్నారు. కానీ, రాజధాని కోసం బాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుస్తున్నారు. సంపద సృష్టిస్తానని ఇప్పుడు మనల్ని సలహా చెప్పమంటున్నారు. పీ-4 అంటూ పేద జనాలను మీరే దత్తత తీసుకుని అభివృద్ధి చేయమంటున్నారు. ఇక ప్రభుత్వం చేసేదేమిటో అర్థం కావడం లేదు (వేల ఎకరాలను కార్పొరేట్లకు నామమాత్రపు ధరకు 99 ఏళ్లకు లీజుకు ఇచ్చి కమీషన్లు బొక్కడం తప్ప).

ఈయనకేం ఇంకో ఐదేళ్లో, పదేళ్లో ఉంటాడు. ఆ తర్వాత ఆయన పుత్రరత్నం మన నెత్తి మీదకెక్కి కూర్చుంటారు. లేదా మరింకెవరో మనల్ని తాకట్టు పెట్టి లక్షల కోట్ల అప్పులు చేస్తారు. మనకు ఒక్కొక్క వ్యక్తి తల మీద లక్షల అప్పు ఉంటుంది. చివరకు రాష్ట్రం నిజంగానే శ్రీలంక అవుతుంది. ఇంతకూ నేను చెప్పొచ్చేదేమిటంటే, మన పాలకుల కీర్తి కాంక్ష రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరం. బీ వేర్ ఆఫ్ దట్ టైప్ ఆఫ్ పొలిటికల్ లీడర్స్..

మానవేంద్ర బసు, ది వైర్ కోసం..

# కూటమితోనే సంక్షేమం

## - టీడీపీ సీనియర్ నాయకులు పాండ్రంకి -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి పాలనలోనే ప్రజా సంక్షేమం సాధ్యమని నగర టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎచ్చెర్ల వీధిలో స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీనెలా ఒకటో తేదీన పింఛన్లు లబ్ధిదారుల ఇంటివద్దనే అందించడం వల్ల పింఛనుదారుల కళ్లలో పట్టరాని ఆనందం వ్యక్తమవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు వితంతువులకు నూతన పింఛన్లు మంజూరుచేసి పంపిణీ చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్లగా వితంతువులు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం, ఇచ్చిన హామీలు అమలుచేసి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మార్చగలిగే శక్తి ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమవుతుందని మరోసారి నిరూపించారన్నారు. డివిజన్ పరిధిలో ఎచ్చెర్లవీధి, చంపగల్లివీధిలో కర్రి విజయలక్ష్మి, మహాలక్ష్మి, సిగిరెడ్డి రోహిణి, రెడ్డి జయలక్ష్మి, పి.కనకరత్నంకు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# నిర్మలకు డాక్టరేట్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంగ్ల భాషాబోధన, అభ్యాస ప్రక్రియలపై మూల్యాంకనాత్మక అధ్యయనంలో పరిశోధకురాలు సదాశివుని నిర్మల పీహెచ్‌డీ సాధించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆంగ్ల బోధన స్థితిగతులను విశ్లేషిస్తూ, విద్యార్థుల ఉపాధి అవకాశాలు, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిలో దాని ప్రాముఖ్యతను ఉద్ఘాటించారు. ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ గైడెన్స్‌లో ఆమె పరిశోధన నిర్వహించారు.

# ఆర్వోబీకి భూముల పరిశీలన

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస కృష్ణాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇక్కడ ఉన్న రైల్వే గేటు స్థానంలో ఆర్వోబీ మంజూరు కాగా దానికి భూ సేకరణ శుక్రవారం కసింవలసపేట రెవెన్యూ గ్రామంలో భూములను పరిశీలించారు. దీని నివేదికను ఆర్డీవోకు అందజేయనున్నట్లు స్థానిక రెవెన్యూ సిబ్బంది తెలిపారు.



# అమెరికా సదస్సుకు కూన

- ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేకు అరుదైన గుర్తింపు
- 28 రాష్ట్రాల 130 మందికి పైగా చారిత్రాత్మక ప్రతినిధి బృందం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



అమెరికాలో జరగబోయే ప్రపంచ ప్రఖ్యాత సదస్సుకు ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఎంపికై అరుదైన గౌరవం లభించింది. యూఎస్ఏలో బోస్టన్ నగరంలో చారిత్రాత్మక ప్రపంచ శాసనసభా సదస్సులో పాల్గొంటున్నారు. ప్రపంచ శాసనసభా నిబద్ధత వైపు ఒక ముఖ్యమైన అడుగును సూచించే మైలురాయిగా నిలిచే సదస్సులో రవికుమార్ ఈ నెల ఆగస్టు 4,5,6 తేదీల్లో జరిగే ప్రతిష్టాత్మక జాతీయ రాష్ట్ర శాసనసభల సమావేశం (ఎన్‌సీఎస్ఎల్)లో పాల్గొంటున్నారు. భారతదేశంలోని 28 రాష్ట్రాల నుంచి 21 రాజకీయ పార్టీల నుంచి ఎంపిక కాబడిన 130 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కూడిన చారిత్రాత్మక ప్రతినిధి బృందంలో భాగం కావడం ఉత్తరాంధ్రకు అరుదైన గుర్తింపు లభించినట్టే. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ఎన్‌సీఎస్ఎల్ వంటి ప్రపంచ వేదికలో రాష్ట్రం, తన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు. ఇది కేవలం అంతర్జాతీయ గుర్తింపు గురించి మాత్రమే కాదని, ఇది పాలనలో ప్రపంచ ఉత్తమ పద్ధతుల నుంచి నేర్చుకోవడం, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవ చేయడానికి అధునాతన పాలన పద్ధతులను అవలంభించడానికి శాసనసభ్యులకు మంచి అవకాశం కల్పించినందుకు ఎన్ఎల్‌సీ భారత్, దాని వ్యవస్థాపకుడు డాక్టర్ రాహుల్ వి.కరాడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో ప్రతినిధి బృందం ప్రపంచవ్యాప్తంగా 7వేల మందికి పైగా శాసనసభ్యులతో పాలనలో ఏఐ, డిజిటల్ ప్రజాస్వామ్యం, సైబర్ భద్రత, ఓటరు నమ్మకం, విధాన ఆవిష్కరణ వంటి కీలకమైన సమకాలీన అంశాలపై సెషన్లలో పాల్గొంటుంది. ఈ కార్యక్రమంలో యూఎస్ శాసన పద్ధతులపై విద్యాధోరణి, ప్రజా సేవ, వ్యాపారం, విద్యారంగంలో భారతీయ సంతతికి చెందిన నాయకులతో పరస్పర చర్చలు కూడా ఉన్నాయి. ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం గొప్ప విశిష్టత, ప్రజాస్వామ్య నాయకత్వం నిరంతరం అభివృద్ధి చెందడానికి, ప్రపంచ వేదికపై సగర్వంగా, గొప్ప ఉద్దేశంతో దేశానికి ప్రాతినిధ్యం వహించాలనే పెరుగుతున్న ఆకాంక్షలను ఇలాంటి సదస్సులు ప్రతిబింబిస్తాయని తెలిపారు.

# ఐటీ పొమ్మంటోంది..
# భవిష్యత్తు భయపెడుతోంది!

(మొదటిపేజీ తరువాయి)

తొలగిస్తున్నాయి. ఉన్నవారికి జీతాల పెంపును నిలిపివేశాయి.

### అనేక సంస్థల్లో ఉద్వాసనలు

మనదేశంలో అపారమైన బ్రాండ్ వేల్యూ కలిగిన టాటా గ్రూప్‌నకు చెందిన టీసీఎస్ ప్రపంచవ్యాప్తంగా తనకు ఉన్న ఆరు లక్షలకుపైగా ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగించాలని నిర్ణయించుకుంది. ఆ ప్రకారం సుమారు 12వేల మంది మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపై ఈ ఏడాది చివరినాటికి వేటు పడనుంది. ఉద్యోగుల జీతాల పెంపును కూడా ఈ సంస్థ ఇంతవరకు ప్రకటించలేదు. కాగా మే నెలలోనే 6వేల మంది ఉద్యోగులను తొలగించిన మైక్రోసాఫ్ట్ ఈ నెలలో మరో 9వేల మందికి ఉద్వాసన పలికింది. అంతకుముందు 2023లో ఈ కంపెనీ 10వేల మందిని తొలగించింది. ఇక ఇంటెల్ సంస్థ తన ఉద్యోగుల్లో 15 శాతం మందిని తొలగించాలని యోచిస్తోంది. దీనివల్ల 24వేల ఉద్యోగాలు పోనున్నాయి. ఎగ్జిక్యూటివ్, చిప్ డిజైన్, క్లౌడ్ ఆర్కిటెక్చర్ వంటి ఉద్యోగులు ఎక్కువగా ప్రభావితం కానున్నారు. ఐబీఎమ్‌లో కూడా దాదాపు 8వేల మందిని తొలగించినట్లు తెలిసింది. వీరిలో ఎక్కువగా హెచ్ఆర్ విభాగానికే చెందినవారు ఉన్నారు. వారి స్థానాలను ఏఐతో భర్తీ చేశారని వార్తలు వస్తున్నాయి. అలాగే అమెజాన్, మెటా, గూగుల్ వంటి బడా సంస్థలు కూడా లేఆఫ్స్ బాటలో పడ్డాయి. 2022 నుంచి ఇప్పటివరకు అమెజాన్‌లో 27 వేల ఉద్యోగాలు పోయాయి. ఈ ఏడాది జూన్‌లో వంద మందిని తొలగించారు. త్వరలో 14వేల మందిని తొలగించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో మెటా కంపెనీ సుమారు 3వేల మందికి ఉద్వాసన పలకగా గూగుల్ సంస్థ క్లౌడ్, పీపుల్ ఆపరేషన్స్, సేల్స్ తదితర డిపార్ట్‌మెంట్లలో పనిచేసే వందలాది ఉద్యోగులకు లేఆఫ్స్ ఇచ్చింది. ఇన్ఫోసిస్ కూడా సైలెంట్‌గా లేఆఫ్‌లు ఇవ్వడంతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి వేతనాల పెంపును వాయిదా వేసింది. అదే బాటలో విప్రో పయనిస్తోంది. ఇక టెక్ మహీంద్రాలో ముఖ్యంగా టెలికాం, బీపీవో స్థాయిల్లో ఉద్యోగులను తొలగించనుంది. హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ ఈ ఏడాది ప్రారంభంలో 350కి పైగా ఉద్యోగులను తొలగించింది.

### ఊడ్చేస్తున్న ఏఐ ప్రళయం

కరోనా సమయంలో ఐటీ కంపెనీలు యువతపై ఆఫర్ల వర్షం కురిపించాయి. వర్క్ ఫ్రం హోమ్‌తో పాటు కోరినన్ని సౌకర్యాలు కల్పించాయి. కట్ చేస్తే మూడేళ్లలో సీన్ రివర్స్ అయ్యింది. ఇటీవలి కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాల్లోకి దూసుకువస్తోంది. కోడింగ్ నుంచి ప్రాజెక్ట్ డెలివరీల వరకు అన్ని పనులను అదే మానిటర్ చేసేస్తుండటంతో టెక్ పరిశ్రమలో అనూహ్య మార్పులు అనివార్యమయ్యాయి. క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా టెక్ సంస్థలు ఏఐ ఆధారిత సేవలను అందుబాటులోకి తెస్తున్నాయి. ఏఐ తీసుకొస్తున్న మార్పులు.. డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, క్లౌడ్ మైగ్రేషన్ వంటి గత మార్పులను మించిపోయాయి. వాటి స్థానంలో ఏఐ ఆధారిత క్లౌడ్ ఆర్కిటెక్ట్స్, డెవాప్స్ ఇంజనీరింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, మల్టీ క్లౌడ్ కన్సల్టెంట్స్, ప్రాంప్టింగ్ ఇంజనీరింగ్‌కు డిమాండ్ పెరుగుతోంది. మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్లు, ఏఐ ఎథిసిస్ట్స్ అవసరం పెరిగింది. దీనికి అనుగుణంగానే ఐటీ సంస్థలు తమ ఉద్యోగులను అప్ స్కిల్లింగ్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అది కుదరని పక్షంలో లేఆఫ్ చేసి ఏఐ నైపుణ్యాలు కలిగిన ఉద్యోగుల నియామకానికి సిద్ధపడుతున్నాయి. ఐటీ రంగంలో నిత్యం మార్పులు జరుగుతుంటాయి. ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికత అందుబాటులోకి వస్తుంటుంది. ఈ మార్పులను గమనించి.. వాటిని అందిపుచ్చుకుని నిరంతరం తమను తాము అప్‌డేట్ చేసుకునే ఉద్యోగులకు ఏఐ తరహా సాంకేతిక విప్లవాలు ఎన్ని వచ్చినా ఇబ్బంది ఉండదు. అదే అప్‌డేట్ కాకుండా కాలక్షేపం చేసే ఉద్యోగులకు మాత్రం ప్రస్తుత ఏఐ విప్లవం ప్రమాదకరమేనని స్పష్టమవుతోంది.

### 1.25 లక్షల మందికి ఎసరు

డిజిటల్ ట్రాన్సఫర్మేషన్ రాకతో 2000-2010 మధ్య 15వేల మంది ఉద్యోగాలను కోల్పోయారు. ఆ తర్వాత 2012-18 మధ్య వచ్చిన క్లౌడ్ టెక్నాలజీ తరంగం సుమారు 70వేల మంది ఉద్యోగులను ప్రభావితం చేసింది. వీటి తర్వాత సైబర్ సెక్యూరిటీ, డెవాప్స్ వంటి నైపుణ్యాలున్న టెక్కీలకు డిమాండ్ పెరిగింది. కానీ ప్రస్తుత ఏఐ అండ్ ఆటోమేషన్ కారణంగా ఈసారి 1.25 లక్షల మంది వరకు టెక్కీలు ఉద్యోగాలు కోల్పోతారని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు జనరేటివ్ ఏఐ, ఏఐ ఆటోమేషన్ వినియోగం పెరగటంతో ఖర్చులు తగ్గించుకోవటానికి కంపెనీలు లేఆఫ్స్ బాట పడుతున్నాయి. దీనివల్ల కంపెనీల్లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ ఉద్యోగులు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఇదే క్రమంలో పలు ఐటీ సంస్థల ఉద్యోగుల వేతనాల పెంపును నిలిపివేశాయి. ఇక స్టార్టప్ కంపెనీలు హైరింగ్‌ను ఫ్రీజ్ చేశాయి.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# ఘనంగా చిన్నీ పుట్టినరోజు వేడుక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో వైకాపా కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఘనంగా జరిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన కేడర్ చిన్నీకి శుభాకాంక్షలు తెలిపారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ పుట్టినరోజు వేడుకలు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం నేతృత్వంలో జరిగాయి. జిల్లా నలుమూలల్లో ఉన్న చిన్నీ అభిమానులు, రామ్‌మనోహర్ యువసేన సభ్యులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అరసవల్లి ఆలయ ట్రస్ట్‌బోర్డ్ మాజీ సభ్యుడు మండవిల్లి రవి చిన్నీకి వేంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మాన ప్రసాదరావు, ఆయన సతీమణి గజలక్ష్మితో పాటు వైకాపా నాయకులు అంబటి శ్రీను, చల్లా రవి, వైకాపా యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్, వైకాపా నగర ప్రధాన కార్యదర్శి సీపాన మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.






ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ పరిధి 15వ డివిజన్‌లో ఇన్‌చార్జి ఇప్పిలి తిరుమలరావు చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# నగరంలో రక్తదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని పీజే బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రొక్కం భాస్కరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ బాలనరసింహ, డాక్టర్ రమణ, పొట్లూరు ప్రతాప్, రొక్కం భాస్కర్ తదితరులు రక్తదానం చేశారు. పీజే నాయుడు బ్లడ్ సెంటర్‌కు చెందిన కృష్ణకిషోర్, కిమ్స్ సిబ్బంది గోపీ, శ్రీను, రాజు, గణేష్, విసు, లోకేష్, హరీష్, దీప, యశ్వంత్, పవన్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆగని అక్రమాలు.. అడిగితే దాడులు!

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఆదేశించారు. కొత్తవలస, పాతూరు మధ్య నాలుగు కిలోమీటర్ల మేర అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో నాగావళి, వంశధార తీరాల్లో 20 అనధికార ర్యాంపులు నడుస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తోటాడ-అక్కివరం, పెద్దదూసి, ముద్దాడపేట, దూసిపేట, కలివరం, తొగరాం, పాతూరు, నిమ్మతొర్లాడ, కొత్తవలస, యరగాం, పురుషోత్తపురం, లాబాం, నారాయణపురం, గండ్రేడు, నెల్లిమెట్ట, బెలమాం, సింగూరులలో వీటిని టీడీపీ నాయకులే నిర్వహిస్తున్నారు.

**గ్రామస్తులతో చర్చించి రవాణా చేసుకోండి**

పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండలంలో వసప గ్రామం మీదుగా మాతల ఎత్తిపోతల పథకానికి.. కొత్తూరు, సీతంపేట మండలాలకు తాగునీరందించే రక్షిత మంచినీటి పథకానికి మధ్యలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీనివల్ల ఎత్తిపోతల పథకానికి నీరు అందే అవకాశం క్రమంగా తగ్గిపోతుందని, తాగునీరు కలుషితం అవుతుందంటూ రెండు రోజుల క్రితం స్థానికులు ఆందోళన నిర్వహించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి రైతులతో కలిసి అనధికార ఇసుక ర్యాంపును పరిశీలించి అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమ రవాణాను అడ్డుకుంటున్న వారిపై దాడులు జరుగుతున్నాయని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్పందించిన కొత్తూరు తహసీల్దార్ బలద ర్యాంపును పరిశీలించి, పది రోజుల పాటు ఇసుక తవ్వకాలు నిలిపేయాలని సూచించి వెళ్లిపోయినట్లు తెలిసింది. గోర్జి మీదుగా ఇసుక లారీలను అనుమతించేది లేదని వసప రైతులు హెచ్చరించడంతో వారితో చర్చించి రవాణా చేసుకోవాలని ఇసుక తవ్వకందారులకు తహసీల్దార్ సూచించినట్టు తెలిసింది. ఆకులతంపరలో ఉన్న అధికారిక ర్యాంపును మూలపేట పోర్టు అవసరాల కోసం నిర్వహిస్తున్నారు. నరసన్నపేట పరిధిలో బుచ్చిపేట, మడపాంలలో తవ్వకాలకు అనుమతులు ఉన్నా, ఇసుకను డంపింగ్ యార్డుకు తరలించకుండా నదీ గర్భంలోనే యంత్రాల సాయంతో లారీలు, ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నారు. రామకృష్ణాపురం ర్యాంపును ప్రభుత్వ అవసరాలకు కేటాయించినా ఇసుక మాత్రం ప్రైవేట్‌కు తరలిపోతోంది. పర్లాం, అంధవరంలలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారు.

**తాగునీటి పథకానికి ముప్పు**

శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో బైరి, కిల్లిపాలెం, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని ముద్దాడ వద్ద అనధికార తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రోజుకు 400కు పైగా ట్రాక్టర్లలో చిలకపాలెం, శ్రీకాకుళం ప్రాంతాలకు తరలిస్తున్నారు. నదిలో నీటి ప్రవాహంతో సంబంధం లేకుండా రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక లభ్యత లేదంటూ ఈ మూడుచోట్ల ఇసుక ర్యాంపులకు నాలుగు నెలల క్రితమే ప్రభుత్వం అనుమతులు రద్దు చేసినా అక్రమార్కులు ల్యాండ్ స్లైడ్‌లను తవ్వేస్తున్నారు. దీంతో నది కరకట్టలు కోతకు గురవుతున్నాయి. బైరి వద్ద వంశధార నదిలో వరద నీరు ఉండటంతో జాతీయ రహదారి వంతెన కింద ఉన్న ల్యాండ్ స్లైడ్‌ను తవ్వేస్తున్నారు. మండల టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కిల్లిపాలెంలో శ్రీకాకుళం మండలంలోని 40 గ్రామాలకు నీరందించే రక్షిత మంచినీటి పథకానికి సమీపంలో తవ్వకాలు సాగిస్తున్నారు. దీనివల్ల తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విడ్డూరమేంటంటే.. అక్రమాలకు పాల్పడుతున్నదీ, వాటిని ప్రశ్నించి ఆందోళన వ్యక్తం చేస్తున్నది కూడా అధికార టీడీపీ నాయకులే. ముద్దాడ ఇసుక ర్యాంపులోనూ ఇదే పరిస్థితి. ప్రశ్నించే వారిపై దాడులకు దిగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల ప్రత్యక్ష ప్రమేయం ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం డిమాండ్ ఉండటంతో ఇసుక అక్రమ రవాణా ఊపందుకుంది. తవ్వకాలు, అక్రమ రవాణాను అడ్డుకునేందుకు భయపడుతున్న రెవెన్యూ, పోలీసు, మైనింగ్, రవాణా శాఖ అధికారులు.. అందిన ఫిర్యాదులపై కూడా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## సిటు జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

ఈ నెల 30, 31న జరుగుతున్న సిటు జిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. మెళియాపుట్టి మండల జట్టు కళాసి సంఘం విస్తృత సమావేశం చాపర సిటు ఆఫీసులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జట్టు, ముఠా, కళాసీ కార్మికులు అత్యంత దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాలు ద్వారానే హక్కులను రక్షించుకోవాలని అన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో జిల్లా 12వ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, మండల జట్టు కళాసి సంఘం నాయకులు కలమట నారాయణరావు, డి.దామోదరరావు, కె.ఉమామహేశ్వరరావు, ఎస్.ప్రకాష్, బి.గోపి, డి.శంకర్రావు పాల్గొన్నారు.





## ముగిసిన పాఠశాల నాయకత్వ శిక్షణ శిబిరాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని సమగ్రశిక్ష ఎడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శశిభూషణ్ శుక్రవారం తెలిపారు. స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ గత నాలుగు రోజులుగా ఎలిమెంటరీ ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయులకు అరసవల్లి స్థానిక విశ్వవిజేత జూనియర్ కళాశాలలో నిర్వహించగా, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఆధ్వర్యంలో శిబిరాలు నేటితో ముగిశాయి. కార్యక్రమానికి ఏఎంవో సుధాకర్ నేతృత్వం వహించగా, రాష్ట్ర పరిశీలకురాలు పొన్నాడ జయలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషణ్ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు నాయకత్వ నైపుణ్యాలను పెంచే ఈ శిక్షణలో పాఠశాల నిర్వహణ, బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు, పాఠశాల వ్యూహాత్మక లక్ష్యాలను నిర్దేశించడంలో, సిబ్బందిని ప్రేరేపించడంలో, పాఠశాల అభివృద్ధికి మార్గదర్శకత్వం వహించడంలో సమర్థవంతంగా ఉంటారన్నారు. పాఠశాల బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమించడానికి వ్యూహాలను రూపొందిస్తారన్నారు. వ్యూహాత్మక ప్రణాళిక, నిర్ణయం తీసుకోవడం, సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడం, సమస్యలను పరిష్కరించడం, వినూత్న బోధనా పద్ధతులు, మూల్యాంకనం, వ్యక్తిగతీకరించిన అభ్యాసం, పాఠశాల బడ్జెట్, సిబ్బంది నిర్వహణ, తల్లిదండ్రులతో సంబంధాలు తదితర అంశాలకు ఈ ట్రైనింగ్ ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానిక గొంటివీధి, గాజుల వీధి, సాబుల తోట, ప్రకాష్‌నగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో 16వ డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్వీ రమణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శిశువులకు తల్లిపాలు శ్రేయస్కరమని, వార్డ్ ఇంచార్జి తోనంగి వెంకన్నయాదవ్ శుక్రవారం అన్నారు. స్థానిక గుజరాతీపేట, హాయతి నగరం 43వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సిడిపిఓ, సూపెర్వైజర్ అధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తోనంగి వెంకన్న మాధవ్ మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యత, తల్లి పాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. బిడ్డ పుట్టిన గంటలో తల్లి ముర్రుపాలు అందించాలని, వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయనీ, అలాగే వ్యాధి నిరోధక శక్తి కలుగుతుందన్నారు. బిడ్డకు మొదటి 6నెలలు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని, 6నెలలు దాటిన తరువాత తల్లి పాలతోపాటు అనుబంధ ఆహారం కూడా ఇస్తారని, తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడతాయన్నారు. ముఖ్యంగా గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సిహెచ్ శ్రీదేవి, జి.రాజేశ్వరి, ఐ.హిమబిందు, కె.లక్ష్మి, జె.శ్యామల, బాలింతలు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.





మండలంలోని కొత్తపోలవలస, లుకలాం పంచాయితీల్లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో శుక్రవారం నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బగ్గు అర్చన పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇసా అప్పారావు, అడపా చంద్రశేఖర్, పట్ట ప్రభాకరరావు, నాగేన సూరన్నాయుడు, మానికల సూర్యనారాయణ, సూర్యనారాయణ, దుల్ల ఆనందరావు, కేవీఎల్ ప్రసాద్, గండేటి నాగభూషణ్, సేనాపతి కృష్ణారావు, గొండు సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా పాతపట్నం మండలం పెద్ద లోగిడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పంపిణీలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని పింఛన్లను పంచి పెట్టారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, పాతపట్నం

## ఇచ్చిన హామీలు నెరవేర్చడం చంద్రబాబు కే సాధ్యం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇచ్చిన హామీలు నెరవేర్చడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా శుక్రవారం స్థానిక ఆదివారంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీనెలా ఒకటో తేదీన పింఛన్లు లబ్దిదారుల ఇంటివద్దనే అందచేయడం వలన పించనుదార్ల కళ్లల్లో పట్టరాని ఆనందం వ్యక్తమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చనిపోయిన పింఛన్‌దార్ల వితంతువులకు ఈ నెలనుండే పింఛను మంజూరు చేసి పంపిణీ చేయడంతో వారి ఆనందానికి అవధులు లేవన్నారు. కార్యక్రమంలో 2వ డివిజన్ ఇంచార్జి అక్కేన రాజారావు, రెడ్డి శివ, జగన్, విశ్వేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది జ్ఞానేష్, భారతి, శివాజీ, వినీల, ధనలక్ష్మి, శ్రీవనిత, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌పై ఉక్కు పాదానికి 50 రోజుల కార్యాచరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో సంపూర్ణ సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కొరకు 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ అక్టోబర్ 2 నాటికి శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో సంపూర్ణ సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కొరకు ప్రతి ఒక్కరు ప్రణాళికబద్దంగా పని చేయాలని కోరారు. ప్రజల సహకారంతో మాత్రమే సంపూర్ణ ప్లాస్టిక్‌నిషేధం సాధ్యమని, ఇందుకోసం అన్ని వర్గాలవారు నగరపాలక సంస్థకు మద్దతుగా భవిష్యత్ తరాల కోసం సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. ప్రతి షాపు యజమానులు ఖచ్చితంగా చెత్త బుట్టను ఏర్పాటు చేసుకోవాలని, గుడ్డ సంచులు లేదా బయో ప్లాస్టిక్ మాత్రమే వాడాలని లేని యెడల మునిసిపల్ యాక్ట్ ప్రకారం షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. టీషాపు గాజు లేదా పింగాణి, స్టీల్‌గ్లాసులు మాత్రమే వాడాలన్నారు. వినాయక మండపాలలో ప్లాస్టిక్‌ను వాడకుండా పర్యావరణ హిత వినాయక చవితిని చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్, హోటల్స్, షాప్స్, వీధి విక్రయదారులు, మెప్మా సిబ్బంది మొదలగు వారందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. బాగస్వాములు కావలసినదిగా కోరారు. సమావేశంలో పాల్గొన్న మునిసిపల్ హెల్త్ ఆఫీసర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీరు, ఆఫీసు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సీఎంఎంలు, సీఓలు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు పాల్గొన్నారు.





స్థానిక షారోన్ ఆశ్రమంలో హెచ్ఐవి పాజిటివ్ ఫ్యామిలీస్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అప్‌హోల్డ్ చైర్మన్ ఫిలిప్ తిమోతి ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన, గృహసర్వే నిర్వహించారు. అదే విధంగా ఒక్కొక్క కుటుంబానికి రూ.780 విలువ చేసే డ్రై రేషన్‌ను అందించారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.